ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

3

జయశంకర్ భూపాలపల్లి ములుగు

శుక్రవారం 25 ఏప్రిల్ 2025




ఎల్కతుర్తిలో సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కల్వకుంట్ల కవిత, నేతలు

ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే హామీలన్నీ నెరవేర్చాలి

- సభలో పల్లీలు, బఠానీలు అమ్ముకునేంత మంది లేరు కాంగ్రెస్‌లో
- రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్సే శ్రీరామ రక్ష
- మహిళలకు ప్రాధాన్యం కల్పించింది కేసీఆరే
- జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- ఎల్కతుర్తిలో రజతోత్సవ సభ ఏర్పాట్ల పరిశీలన

5

కాంగ్రెస్‌లో.. 'సంస్థాగత' సందడి



అధికార కాంగ్రెస్ పార్టీలో సంస్థాగత ఎన్నికల సందడి మొదలైంది. పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు తమ ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు, అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లే దిశగా కాంగ్రెస్ అడుగులు వేస్తోంది. అయితే అధికార పార్టీ కావడంతో మండల, జిల్లా స్థాయిల్లో పదవుల కోసం హస్తం నేతల్లో ఆసక్తి పెరిగింది. ఈ క్రమంలో శుక్రవారం నుంచి మే 20వ తేదీ వరకు అన్ని జిల్లాల్లో పార్టీ సంస్థాగత పదవుల ఎన్నిక ప్రక్రియ పూర్తిచేయాలని అధిష్ఠానం ఆదేశించటంతో పాటు పీసీసీ పరిశీలకులను కూడా నియమించింది. దీంతో పాటు 2017, అంతముందుకు నుంచి పార్టీలో పని చేస్తున్నవారికి పదవుల్లో ప్రాధాన్యమిస్తూనే.. యువత, మహిళలు, సీనియర్లకు పెద్దపీట వేయాలని సూచించింది. మరోవైపు డీసీసీ పగ్గాలు చేపట్టేందుకు ఎమ్మెల్యేలు ఆసక్తి చూపటం లేదు. అయితే కొన్ని జిల్లాల్లో జిల్లా అధ్యక్ష పీఠంపై తమ వారసులను కూర్చోపెట్టేందుకు కీలక నేతలు ప్రయత్నాలు చేస్తుండటంతో కాంగ్రెస్‌లో సంస్థాగత సందడి నెలకొంది. ఇదే సమయంలో ఎన్నాళ్లుగా పదవుల కోసం ఎదురుచూస్తున్న వారు తమ తమ నేతల ద్వారా ముమ్మర ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

నేటి నుంచి మే 20వ తేదీ వరకు సమావేశాలు

ఓరుగల్లు కాంగ్రెస్‌లో సంస్థాగత ఎన్నికల కోలాహలం నెలకొంది. గతేడాది సెప్టెంబరు 6న టీపీసీసీ అధ్యక్షుడిగా బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి ఏడు నెలలుగా సంస్థాగత ఎన్నికలు నిర్వహిస్తారని నాయకులు, కార్యకర్తలు ఆశగా ఎదురు చూస్తున్నారు. కానీ పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా వాయిదా పడుతూ వస్తున్న సంస్థాగత ఎన్నికలకు ఎట్టకేలకు ముహూర్తం ఖరారైంది. శుక్రవారం నుంచి మే 20వ తేదీ వరకు సంస్థాగత ఎన్నికలను పూర్తి చేయాలని ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఆదేశించారు. ఈ నెల 25నుంచి 30వ తేదీ వరకు జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహిస్తారు. మే 4వ తేదీ నుంచి 19వ తేదీ వరకు బ్లాక్, నియోజకవర్గ స్థాయి సమావేశాలు నిర్వహించి, మండల, బ్లాక్, డీసీసీ స్థాయి నుంచి టీపీసీసీలో ఉపాధ్యక్షులు, ప్రధానకార్యదర్శులు, వర్కింగ్ ప్రెసిడెంట్లు తదితర పదవులకు సిఫార్సులు తీసుకోవాలని అధిష్ఠానం నిర్ణయించింది. ఈ మేరకు పీసీసీ పరిశీలకులను నియమించారు. వరంగల్ జిల్లాకు అమీర్ ఆలీఖాన్, మేడి రవిచంద్ర, హనుమకొండ జిల్లాకు కోమటిరెడ్డి వినయ్‌రెడ్డి, మక్సూద్ అహ్మద్, భూపాలపల్లి జిల్లాకు కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, ములుగు జిల్లాకు కొండేటి మల్లయ్య, మహబూబాబాద్ జిల్లాకు పోట్ల నాగేశ్వర్‌రావు, కూచన రవళి, జనగామ జిల్లాకు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌ను నియమించారు. శుక్రవారం నుంచి సంస్థాగత ఎన్నికల ప్రక్రియ చేపడుతుండటంతో కాంగ్రెస్‌లో కోలాహలం నెలకొంది.

- మండలాల నుంచి డీసీసీల వరకు కమిటీల ఏర్పాటుపై కసరత్తు
- ఇప్పటికే అన్ని జిల్లాలకు పీసీసీ పరిశీలకులను నియమించిన అధిష్ఠానం
- 2017, అంతకుముందు నుంచి పార్టీలో ఉన్నవారికే పదవుల్లో ప్రాధాన్యం
- సీనియర్లతో పాటు మహిళలు, యువతకు పెద్దపీట వేయాలన్న నాయకత్వం
- డీసీసీ పీఠాలపై పలువురు నేతల వారసుల ఆసక్తి
- ఉమ్మడి జిల్లా హస్తం శ్రేణుల్లో సందడి
- పదవులు దక్కించుకునే ప్రయత్నాల్లో ఆశావహులు

సీనియర్లకే ప్రాధాన్యం..

కాంగ్రెస్ పదవుల్లో అధిష్ఠానం ట్విస్ట్ ఇచ్చింది. 2017, అంతకు ముందు నుంచి పార్టీలో పని చేస్తున్నవారికి పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ సూచించారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆమె ఈ మేరకు సూచనలు చేశారు. ప్రతిపక్షంలో ఉండి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకరావడానికి సైనికుల్లా పని చేసిన వారికి పార్టీ పదవుల్లో ప్రాధాన్యం ఉండాలని సూచించారు. దీంతో సీనియర్ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల, జిల్లా కమిటీల్లో సీనియర్లకు ప్రాధాన్యత పెరుగుతుందని భావిస్తున్నారు. అలాగే యువతకు, మహిళలకు కూడా అదే స్థాయిలో పదవుల్లో ప్రాధాన్యత ఉండాలని అధిష్ఠానం ఆదేశించింది. సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయటంతో పాటు అన్ని వర్గాల వారికి పార్టీలో కీలక పదవులు దక్కేలా కసరత్తు చేస్తోంది. దీంతో ప్రతిపక్షంలో ఉన్న పదేళ్ల పార్టీ కోసం పని చేసిన నేతలు పదవులు దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం అధికారంలో ఉండటంతో పార్టీ పదవికి ప్రాధాన్యం ఉంటుందనే ఆశతో మండల, జిల్లా కార్యవర్గాల్లో చోటు కోసం ద్వితీయ శ్రేణి నేతలు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలపై పార్టీ పదవుల కోసం ఒత్తిడి తీసుకవస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ అభ్యర్థుల ఎంపికలో పార్టీ కార్యవర్గాలు కీలకం కావటంతో పదవి కోసం పోటీ పెరుగుతుంది. పార్టీలో పదవి కోసం డిమాండ్ చేస్తే.. అనివార్య కారణాల వల్ల రాలేకపోయినప్పటికి జడ్పీటీసీ, ఎంపీపీ పదవులపై హామీ దక్కుతుందనే ఆశతో మరికొందరు ఉన్నారు. మరికొందరైతే పార్టీ పదవుల రేసులో ఉంటే కనీసం నామినేటెడ్ పదవుల్లో చైర్మన్, డైరెక్టర్ పోస్టులైనా

మిగతా 5వ పేజీలో...

పహల్గాం మృతులకు అశ్రు నివాళి



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు, ప్రజలు

కాటారం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన పర్యాటకులకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో కన్నీటితో నివాళులర్పించారు. కాటారంలోని అంబేద్కర్ కూడలిలో గురువారం రాత్రి ఈ కార్యక్రమం జరిగింది. దీనికి ముందు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఐదు మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇందులో పాల్గొన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ రాష్ట్ర నేత దుద్దిళ్ల శ్రీనుబాబు మాట్లాడుతూ పర్యాటకులను కాల్చి చంపడం పిరికిపంద చర్య అని దుయ్యబట్టారు. ఉగ్రమూకల భరతం పట్టడానికి కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఉగ్రవాదులకు ఉరి తీయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేష్, మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాపు, డీసీసీ ఉపాధ్యక్షుడు గద్దె సమ్మిరెడ్డి, ఐదు మండలాల కాంగ్రెస్ నేతలు చల్ల తిరుపతిరెడ్డి, కొండ రాజమ్మ, దుర్గయ్య, రాజిరెడ్డి, రాజయ్య, వంశవర్ధన్‌రావు, నవీన్‌రావు, కుమార్, రమేష్‌రెడ్డి, వామన్‌రావు, శ్రీకాంత్, రాజు, శ్రీహరి, అశోక్, అజీజ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్‌లో సత్తాచాటిన సింగరేణి కార్మికుడి కుమారుడు

- 855 ర్యాంకు సాధించిన జితేంద్ర నాయక్
- సన్మానించిన జీఎం రాజేశ్వర్‌రెడ్డి



ర్యాంకు సాధించిన బానోతు జితేంద్ర నాయక్‌ను సన్మానిస్తున్న సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి

కృష్ణకాలనీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పట్టణ పరిధి ఎంసీ క్వార్టర్స్‌కు చెందిన బానోతు జితేంద్ర నాయక్ సివిల్స్‌లో 855 ర్యాంకు సాధించాడు. జితేంద్ర తండ్రి హేమానాయక్ సింగరేణి కార్మికుడు. భూపాలపల్లి ఏరియా వర్క్‌షాప్‌లో ఎలక్ట్రికల్ ఫోర్‌మన్‌గా పని చేస్తున్నాడు. సివిల్స్ ప్రతిభ కనబర్చిన జితేంద్రనాయక్‌తో పాటు తల్లిదండ్రులను సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి తన కార్యాలయంలో గురువారం సన్మానించారు. ఓ సింగరేణి కార్మికుడు తన కుమారుడిని ఇంతటి

మిగతా 6వ పేజీలో...

నిరుద్యోగ సమస్య నిర్మూలనే లక్ష్యం

- 17న భూపాలపల్లిలో మెగా జాబ్‌మేళా
- యువతకు మెండుగా ఉద్యోగావకాశం
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ సమస్య నిర్మూలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఇందులో భాగంగా భూపాలపల్లిలో మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు తెలిపారు. భూపాలపల్లిలోని పుష్పగార్డెన్స్‌లో వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే గురువారం జాబ్‌మేళా సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 27న భూపాలపల్లి పుష్పగార్డెన్స్‌లో మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ మెగా జాబ్‌మేళాకు 87 కంపెనీలు వస్తున్నాయని అన్నారు. పదో తరగతి నుంచి పీజీ వరకు, అలాగే బీటెక్, ఎంటెక్ వారికి అవకాశాలు ఉంటాయని తెలిపారు. జాబ్ మేళాకు ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా 7.624 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఉదయం 8గంటల నుంచే ఇంటర్వ్యూల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఈ క్రమంలో ఎవరికీ ఇబ్బందులు తలెత్తకుండా 75 కౌంటర్లను వేర్వేరుగా ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, ఈ సౌకర్యాన్ని సింగరేణి జీఎం పర్యవేక్షించాలన్నారు. ఓ యువకుడు తాను స్వచ్ఛందంగా నిరుద్యోగ యువత కోసం 15వేల వాటర్ బాటిల్స్ ఉచితంగా పంపిణీ చేస్తానని తెలపగా అతడిని ఎమ్మెల్యే అభినందించారు. ఈ జాబ్‌మేళా సక్సెస్ కోసం అన్ని విభాగాల అధికారులు కృషి చేయాలని కోరారు. ప్రధానంగా వైద్యశాఖ అధికారు లు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, అలాగే ప్రతి ఒక్కరికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని తెలిపారు. తోపులాటలు జరగకుండా ప్రతి కౌంటర్ వద్ద సెక్యూరిటీని పకడ్బందీగా పెట్టాలని పోలీసు అధికారులను ఎమ్మెల్యే కోరారు. జిల్లాలోని 11 మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు అన్ని గ్రామాల్లో తమ సిబ్బంది ద్వారా నిరుద్యోగ యువతను జాబ్‌మేళా సెంటర్‌కు తీసు కొచ్చేలా వాహనాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి, డీఎస్పీ సంపత్‌రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు లొంగిపోవాలి..



సమావేశంలో మాట్లాడుతున్న మల్టీజోన్ -1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

- రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుంది..
- మీడియా సమావేశంలో మల్టీజోన్ -1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి
- 14 మంది చత్తీస్‌గఢ్ మావోయిస్టుల లొంగుబాటు
- ఒక్కొక్కరికి రూ.25వేల రివార్డు అందజేత

వివరాలు 5లో...

పుష్కరాల పనుల్లో జాప్యం చేయొద్దు

- అధికారులతో కలెక్టర్ రాహుల్‌శర్మ
- పీఆర్ ఈఈపై మండిపాటు



టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ మండలంలో వచ్చే నెల జరిగే సరస్వతీ పుష్కరాల పనుల్లో అధికారులు ఎలాంటి జాప్యం చేయొద్దని కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. సరస్వతీ పుష్కర పనుల ప్రత్యేక పర్యవేక్షణ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో ఆయన గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పుష్కరాల పనుల్లో జాప్యం జరిగితే చర్యలు తీసుకుంటామన్నారు. నిర్లక్ష్యాన్ని సహించేది లేదని తేల్చిచెప్పారు. ప్రతి పనుల పర్యవేక్షణకు ఒక్కో జిల్లా అధికారిని నియమించామన్నారు. ప్రతి రోజూ పనులను పరిశీలించాలని, నిర్ణీత సమయానికల్లా పూర్తయ్యేలా కృషి చేయాలని అన్నారు. ప్లాస్టిక్ రహిత పుష్కరాలను నిర్వహించడమే లక్ష్యంగా పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు.

నాలో మంచితనమే చూశారు..

పంచాయతీరాజ్ ఈఈ వెంకటేశ్వర్లుపై కలెక్టర్ రాహుల్ శర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. పుష్కరాల పనుల్లో జాప్యమవు తుండటంపై మండిపడ్డారు. 'నాలో మంచి తనమే చూశారు.. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే మరో కోణం చూస్తారు' అంటూ అసహనం వ్యక్తం చేశారు. పుష్కర పనులు పూర్తి చేయడం చాలా ప్రాధాన్యమన్నారు. పనులు పూర్తి చేయలేకపోతే జిల్లా నుంచి వెళ్లిపోండని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతి లేనిది కాళేశ్వరం విడిచి బయటకు వెళ్లొద్దని ఆదేశించారు.

జీజీహెచ్‌లో అరుదైన ఆపరేషన్

- రొమ్ము క్యాన్సర్‌కు తొలి శస్త్ర చికిత్స



రొమ్ము క్యాన్సర్ ఆపరేషన్ అనంతరం డాక్టర్ల బృందం

భూపాలపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్)లో అత్యాధునిక చికిత్సలు అందుబాటులోకి వస్తున్నాయి. వరంగల్‌లో మాత్రమే జరిగే శస్త్ర చికిత్సలను ఇప్పుడు ఇక్కడా చేస్తున్నారు. తాజాగా గురువారం ఈ ఆస్పత్రిలో అరుదైన ఆపరేషన్ జరిగింది. రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్న ఓ మహిళా రోగికి ఇక్కడి వైద్యులు శస్త్ర చికిత్స చేశారు. భూపాలపల్లి జీజీహెచ్‌లో ఈ తరహా ఆపరేషన్ జరగడం ఇదే తొలిసారి.

భూపాలపల్లి పట్టణంలోని సుభాష్‌కాలనీకి చెందిన ఓ మహిళ గత కొంత కాలంగా రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతోంది. వారం రోజుల క్రితం ఆస్పత్రిలో చేరిన ఆమెకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ నాగార్జునరెడ్డి నేతృత్వంలో గురువారం మాడిఫైడ్ రాడికల్ మ్యాస్టెక్టొమీ శస్త్రచికిత్స చేశారు. ఈసందర్భంగా సూపరింటెండెంట్ నవీన్ కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్ ఆపరేషన్ సక్సెస్ అయ్యిందని, రోగి ఆరోగ్యంగానే ఉందని తెలిపారు. కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రత్యేక చొరవతో ఆస్పత్రిలో సీఎస్ఆర్ నిధుల ద్వారా ఏర్పాటు చేసిన సౌకర్యాల వల్లే ఈ శస్త్రచికిత్స సాధ్యమైందన్నారు.



జడ్జి షాలినికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మహిళా న్యాయవాదులు

విధుల్లో చేరిన సీనియర్ సివిల్ జడ్జి షాలిని

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా సీనియర్ సివిల్ కోర్టు జడ్జిగా షాలిని గురువారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా కోర్టులో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీనియర్ సివిల్ జడ్జి షాలినికి మహిళా న్యాయవాదులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పనిచేసిన సీనియర్ సివిల్ జడ్జి సురేష్ హైదరాబాద్‌లోని అడిషనల్ సిటీ సివిల్ కోర్టుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సంగారెడ్డి సివిల్ కోర్టు జడ్జిగా విధులు నిర్వహిస్తున్న షాలినిని మహబూబాబాద్ జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రేమ్‌చందర్, మౌనిక, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బకు గురైన కూంబింగ్ జవాన్లు

15 మందికి అస్వస్థత

వెంకటాపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కర్రెగుట్టల్లో కూంబింగ్ చేస్తున్న కేంద్ర బలగాలు వడదెబ్బకు గురైనట్లు తెలుస్తోంది. విపరీతమైన ఎండవేడికి అడవుల్లో కూంబింగ్ చేస్తున్న 15 మంది జవాన్లు వడదెబ్బకు గురయ్యారు. ఈక్రమంలోనే గురువారం సాయంత్రం వారిని కర్రెగుట్టల ప్రాంతం నుంచి ప్రత్యేక హెలీకాప్టర్లలో ములుగు జిల్లా వెంకటాపురం ప్రభుత్వ వైద్య శాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కర్రెగుట్టల ప్రాంతంలో ప్రస్తుత ఎండ లకు నీటి జాడ ఉండకపోవడం, మూడురోజుల నుంచి గుట్టలపైనే కేంద్ర బలగాలు మావోయిస్టుల కోసం వేట కొనసాగిస్తున్నాయి. ఈక్రమంలోనే పలువురు జవాన్లు డీహైడ్రేషన్‌కు గురయ్యారు.

బెల్లం విక్రయిస్తే పీడీ యాక్ట్



పాత నేరస్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న తొర్రూరు డీఎస్పీ కృష్ణకిశోర్

మరిపెడ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు హానికరమైన నల్ల బెల్లం విక్రయిస్తే ఇక నుంచి పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని తొర్రూరు డీఎస్పీ కృష్ణకిశోర్ హెచ్చరించారు. గురువారం మరిపెడ పీఎస్‌లో బెల్లం వ్యాపారం చేసిన పాత నేరస్థులకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. డీఎస్పీ మాట్లాడుతూ అక్రమార్కులను ఉపేక్షించేదిలేదన్నారు. బెల్లం, ఇసుక, బియ్యం దందా చేస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. అనంతరం మరిపెడ పీఎస్‌లో కూల్ వాటర్ సప్లయి యంత్రాన్ని డీఎస్పీ ప్రారంభించారు. మరిపెడ సీఐ రాజ్ కుమార్‌గౌడ్, ఎస్సైలు సతీష్ గౌడ్, సంతోష్, స్థానిక పీఎస్ సిబ్బంది ఉన్నారు.

గీతకార్మికుడికి గాయాలు



చికిత్స పొందుతున్న వీరస్వామి

తొర్రూరురూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తాటిచెట్టు పైనుంచి పడిన గీతకార్మికుడికి గాయాలు అయిన సంఘటన మండలంలోని నాంచారిమడూరు గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... నాంచారిమడూరు గ్రామానికి చెందిన మాదాటి వీరస్వామి రోజు మాదిరిగానే కల్లుగీస్తూ జీవనోపాధి పొందుతున్నారు. తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారికింద పడ్డాడు. ఎడమ చెయ్యి, పక్కటెముక్కలు విరిగాయి. హన్మకొండలోని ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతున్నారు.

అపార నిక్షేపాలు.. ఆంక్షలతో అడ్డంకులు

- వెంకటాపూర్ టు మణుగూరు వరకు బొగ్గు నిల్వలు
- గుర్తించిన అన్వేషణ విభాగం
- కేంద్ర ప్రభుత్వం స్వాధీనం
- రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి గండి



ములుగు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): గోదావరి పరీవాహక ప్రాంతంలో అపార బొగ్గు నిక్షేపాలు ఉన్నాయి. అయినా కొత్త గనులను ఏర్పాటు చేసుకొనేందుకు సింగరేణికి అడ్డంకులు ఎదురవుతున్నాయి. గోదావరి వ్యాలీని ఆనుకొని 350 కిలో మీటర్ల మేర బొగ్గు నిక్షేపాలు ఉన్నట్లు జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, సింగరేణి సర్వే విభాగం ఇప్పటికే గుర్తించాయి. ఎంతలోతులో బొగ్గు నిల్వలు ఉన్నాయి.. భూగర్భ పరిస్థితులు ఏమిటి? అని పరిశీలించాయి. అనంతరం సింగరేణి యాజమాన్యం బొగ్గు గనుల అనుమతుల కోసం దరఖాస్తులు చేసుకుంది. అవి లభించాక వెంటనే బొగ్గు ఉత్పత్తి పనులు మొదలు పెట్టాల్సి ఉంది. ఇదిలా ఉండగా బొగ్గు నిల్వలు ఎక్కడ ఉన్నా ఎలాంటి టెండర్లు లేకుండానే సింగణి యాజమాన్యం ఉత్పత్తిని చేపట్టేది. 2015 తర్వాత పరిస్థితులు మారాయి. సింగరేణి, జీఎస్ఐ గుర్తించిన గనులను కేంద్ర ప్రభుత్వం వేలం వేసి టెండర్ దక్కించుకున్న వారికే కేటాయిస్తోంది. దీంతో బొగ్గు గనులు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తున్నాయి.

తీసుకోవాల్సిన అనుమతులు ఇవే...

కొత్త బొగ్గు గనులను ప్రారంభించేందుకు ముందుగా సింగరేణి బోర్డు పర్మీషన్ తీసుకోవాల్సి ఉంటుంది. కేంద్ర మంత్రిత్వ శాఖ నుంచి లీజ్ అగ్రిమెంట్, మైనింగ్ ప్లాన్ అప్రూవల్ తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే ఎన్విరాన్మెంట్ క్లియరెన్స్ డీజీఎంఎస్ అప్రూవల్ తీసుకోవాలి. బొగ్గు గనులను అడవి ప్రాంతాల్లో విస్తరిస్తే అటవీ శాఖ వద్ద డైవర్షన్ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఇలా అనేక పర్మీషన్లు వచ్చాక సింగరేణి యాజమాన్యం బొగ్గు ఉత్పత్తి పనులు మొదలు పెట్టాల్సి ఉంటుంది.

వెంకటాపూర్ నుంచి మణుగూరు వరకు నిల్వలు

భాతరదేశంలో విద్యుత్ అవసరాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. దీనికి అనుగుణంగా బొగ్గు ఉత్పత్తిని పెంచేందుకు సింగరేణి యాజమాన్యం కృషి చేస్తోంది. అందులో భాగంగానే నూతన గనుల ఏర్పాటుకు పూనుకుంది. ఈ క్రమంలో ములుగు జిల్లా వెంకటాపూర్ నుంచి మొదలుకొని భద్రాద్రి కొత్తగూడెం వరకు బొగ్గు నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించింది. వాటిని వెలికితీసేందుకు అనుమతుల కోసం పడిగాపులు కాస్తోంది. ప్రస్తుతం వెంకటాపూర్‌లో పీవీఎన్ఆర్ ఓసీ పేరిట 2020 నవంబరులో పనులను ప్రారంభించారు. అయితే.. పలు రకాల అడ్డంకులు రావడంతో ఆరు నెలలు ముగియక ముందే అవి నిలిచిపోయాయి.

ఓసీకి అనుమతులకు రామప్ప అడ్డంకి

ములుగు జిల్లాలోని వెంకటాపూర్‌లో పీవీ నరసింహారావు (పీవీఎన్ఆర్) పేరిట ఓపెన్‌కాస్టు గనిని ఏర్పాటు చేసేందుకు సింగరేణి యాజమాన్యం నాలుగేళ్ల క్రితం పనులను ప్రారంభించింది. అయితే.. ప్రతిష్టాత్మక రామప్ప దేవాలయం దాని సమీపంలో ఉండటం, అప్పుడే ఆ ఆలయానికి యునెస్కో గుర్తింపు రావడంతో పనులకు అవరోధం ఏర్పడింది. పీవీఎన్ఆర్ ఓసీలో ఎంతో విలువైన జీ-5 బొగ్గు లభిస్తుందని, దీంతో సింగరేణి యాజమాన్యానికి లాభాలు వస్తాయని భావించగా రామప్ప పరిరక్షణ కమిటీ ఫిర్యాదు చేయడంతో పనులు నిలిచిపోయాయి. అయినా పట్టు వదలని విక్రమార్కుడిలా సింగరేణి యాజమాన్యం వాటి అనుమతుల కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉంది.

బొగ్గు గనుల్లో కేంద్ర ప్రభుత్వం జోక్యం

సింగరేణి వ్యాప్తంగా 82 బొగ్గు బ్లాకులు ఉన్నట్లు సంబంధిత విభాగం అధికారులు గుర్తించారు. ఇందులో 42 బొగ్గు గనులు మాత్రమే సింగరేణి ఆధీనంలో ఉన్నట్లు పలువురు అధికారులు చెబుతున్నారు. మిగిలిన 40 బొగ్గు బ్లాకులు వేలం వేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే.. 2015కు ముందు బొగ్గు నిల్వలు ఎక్కడ ఉన్నా సింగరేణి యాజమాన్యమే ఉత్పత్తి చేపట్టేది. కానీ ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పలు రకాల సాకులు చూపుతూ టెండర్లకు ఆహ్వానిస్తోంది. ఈ క్రమంలో ప్రైవేటు కంపెనీల చేతుల్లోకి టెండర్లు వెళ్లిపోతున్నాయి. దీంతో సింగరేణిలో ప్రైవేటు వ్యక్తుల ఆధిపత్యం పెరిగిపోతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, సింగరేణి సర్వే విభాగాలు గుర్తించిన అన్ని బొగ్గు గనులను ఎలాంటి టెండర్లు లేకుండా సింగరేణికే కేటాయించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

కశ్మీర్‌లో ఉగ్రదాడికి నిరసనగా..

కోర్టు విధులు బహిష్కరించి ర్యాలీ చేపట్టిన న్యాయవాదులు



మహబూబాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గామ్‌లో టూరిస్టులను ఉగ్రవాదులు అతికిరాతకంగా కాల్చి చంపడం పిరికిపంద చర్య అని మానుకోట జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రేమ్‌చందర్, సిద్ధు అన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని గురువారం కోర్టు విధులను బహిష్కరించి నల్లబ్యాడ్జీలు ధరించి కోర్టు సెంటర్, తహసీల్ సెంటర్, ఇందిరాగాంధీ, నెహ్రూసెంటర్ మీదుగా కూరగాయల మార్కెట్ నుంచి కోర్టు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాశ్మీర్ చూసేందుకు వచ్చిన టూరిస్టులపై పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు ఒక్కసారిగా తుపాకులతో టూరిస్టులను కాల్చి చంపడం బాధాకరమని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదులు కొండపల్లి కేశవరావు, చలపతిరావు, చిలుకమారి వెంకటేశ్వర్లు, డి.వెంకటస్వామి, కొంపెల్లి వెంకటయ్య, తుంపిళ్ల శ్రీనివాస్, హరికృష్ణ, ఉప్పలయ్య, మామిడాల సత్యనారాయణ, పుల్లూరి కృష్ణయ్య, మహేందర్, గిరి, ప్రభాకర్‌రెడ్డి, ఆనంద్‌కుమార్, మున్నా, జ్యోతిబాబు, దర్శనం రామకృష్ణ, యాకన్న, వీరన్న, లాలు, లక్ష్మణ్, బుర్ర శ్రీనివాస్, మోహన్‌నాయక్, మౌనిక, రాజమణి, సునిత, పాల్గొన్నారు.

- తొర్రూరు: జమ్మూ కశ్మీర్ పహల్గాంలో ఇండియా టూరిస్టులపై ఉగ్రవాదుల దాడి అమానవీయమని తొర్రూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు అన్నారు. గురువారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముకుందరావు మాట్లాడుతూ టూరిస్టులపై దాడి చేసిన ఉగ్రవాదులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నిందితులకు వెంటనే శిక్షలు విధించాలన్నారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన అబ్దుల్ రఫీని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు అశోక్, రామకృష్ణ, నాగరాజు, ఐలేష్, వెంకటేశ్వర్లు, ప్రవీణ్ రాజు, యాకాంబ్రం తదితరులు ఉన్నారు.

దర్గాగా మత్తడి కబ్జా

- పట్టించుకోని అధికారులు



చెరువు మత్తడిని పూడ్చి నిర్మించిన భవనం

మంగపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా మంగపేట మండలం తిమ్మంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని తిమ్మ చెరువు మత్తడిని కొందరు దర్గాగా కబ్జా చేశారు. ఎంచక్కా భవనాలు సైతం నిర్మించుకున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం చూసీ చూడనట్టు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. మత్తడి కబ్జాకు గురైందని పలుమార్లు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందించడం లేదని తిమ్మంపేట, చెరుపల్లి రైతులు అంటున్నారు.

ఆరు నెలలుగా వర్షాలు కురువకపోవడంతో చెరువు మత్తడి పారే వైపు ఉన్న ఖాళీ స్థలాలను కొందరు ఆక్రమించుకుంటున్నారు. మత్తడి నీరు పారకుండా చేస్తున్నారని, దీంతో వర్షాకాలంలో ఇబ్బందులు తప్పేలా లేవని రైతులు, గ్రామస్థులు అంటున్నారు. ఈ చెరువు కింద సుమారు 500 ఎకరాల ఆయకట్టు ఉందని తెలిపారు. ఈ నిర్మాణాలతో మత్తడి పోయకుండా అడ్డంకులు ఏర్పడితే చెరువు గండిపడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీరు లేకుండా పంటలు పండకుండా నష్టం వాటిల్లొచ్చని అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మా ణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విష యంపై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఇది తమ పరిధిలో ఉన్న అంశం కాదని దాటవేశారు.



నిరసన తెలుపుతున్న ముస్లిం మైనార్టీ నాయకులు

ముష్కర దాడికి నిరసనగా ముస్లింల ర్యాలీ

తొర్రూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్ లోయలో టూరిస్టులపై పాకిస్తాన్ ముష్కరులు చేసిన దాడిని ఖండిస్తూ తొర్రూరులోని ముస్లిం మైనార్టీ నాయకులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి అమర వీరుల స్థూపం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం నాయకులు ఎమ్డీ.జలీల్, ఎమ్డీ.అమీర్ మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదులు హిందువులపై జరిపిన దాడిని ముక్త కంఠంతో ఖండిస్తున్నామన్నారు. దాడులకు పాల్పడిన పాకిస్తాన్ ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కశ్మీర్ లోయలో టూరిస్ట్ ప్రాంత పహల్గాం స్విట్జర్‌ల్యాండ్‌ను తలపించే విధంగా ఉంటుందని, అలాంటి ప్రాంతంలో ముష్కరులు దాడులు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో జమామజీస్ సదర్ కమిటీ అధ్యక్షుడు అలీమ్, మౌలానా, యూసఫ్, యాకూబ్ పాషా, సయ్యద్, గుంశావళి, గఫార్, రషీద్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ సర్వేను అడ్డుకున్న రైతులు

కాటారం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని గుమ్మళ్లపల్లి పరిధిలో చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం కోసం నిర్వహిస్తున్న భూసేకరణ సర్వేను గురువారం పలువురు రైతులు అడ్డుకున్నారు. ఎస్‌డీసీ డీఐ రాములు ఆధ్వర్యంలో సర్వే చేపట్టడానికి సిబ్బంది వెళ్లగా పలువురు రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సాగునీటితో పంటలు పండించుకునే తమ భూముల్లోంచి కాల్వల అలైన్‌మెంట్ సరిగా లేదన్నారు. సేకరణ పేరుతో కొంత భూమిని తీసుకుని కొంత వదిలేస్తే వ్యవసాయం ఎలా చేస్తారని ప్రశ్నించారు. రైతులందరికీ నష్టం జరగకుండా అలైన్‌మెంట్ మార్చాలని కోరారు. ఈ సర్వేయర్లు వినయ్, నిరంజన్, రామకృష్ణ, రైతులు తదితరులు ఉన్నారు.



సర్వే అధికారులతో మాట్లాడుతున్న రైతులు

గాయపడిన యువకుడి మృతి

పెగడపల్లి రోడ్డు ప్రమాద ఘటనలో మూడుకు చేరిన మృతుల సంఖ్య



ప్రేమేష్ (ఫైల్)

కొత్తగూడ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెగడపల్లి సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి సంఖ్య మూడుకు చేరింది. ఈ ప్రమాదంలో గాయపడిన గువ్వ ప్రేమేష్(18) వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. పెగడపల్లి సమీపంలో ద్విచక్ర వాహనం, ట్రాలీఆటో ఎదు రెదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన అక్కాచెల్లెలు జంగా మౌనిక, నవ్య సంఘటన స్థలంలోనే మృతి చెందిన విషయం తెలిసిందే. పొగుళ్ల పల్లికి చెందిన గువ్వ దొరబాబు, కవిత దంపతుల ఏకైక కుమారుడు గువ్వ ప్రేమేష్, అదే గ్రామానికి చెందిన జూల కార్తీక్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రేమేష్‌ను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. అలాగే జూల కార్తీక్‌ను వరంగల్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతున్నాడు. దీంతో పొగుళ్లపల్లి గ్రామంలో విషాదం నెలకొంది.

లక్ష్మీపురంలో విషాదం



లక్ష్మీపురంలో మౌనిక, నవ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అక్కాచెల్లెలుకు కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు గురువారం కన్నీటితో అంతిమ వీడ్కోలు పలికారు. లక్ష్మీపురంకు చెందిన జంగా సంపత్-ఎలేంద్రల కూతురు జంగా మౌనిక(18), జంగా ఎల్లయ్య-రజితల కూతురు జంగా నవ్య(17) పెగడపల్లి సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఇద్దరు యువతులు అన్నదమ్ముల కూతుర్లు కావడంతో ఆ ఇళ్లలో రోదనలు మిన్నంటాయి. యువతుల మృతితో లక్ష్మీపురంలో విషాదం నెలకొంది. మంత్రి సీతక్క కోడలు కుంజ కుసుమాంజలి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చల్లా నారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ పుష్పలత, డీసీసీ జన రల్ సెక్రటరీ బానోత్ రూప్‌సింగ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరబోయిన మొగిలి, నాయకులు యువతుల భౌతికకాయాలను సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొమ్మనబోయిన వేణు, అధికార ప్రతినిధి బానోత్ జవహర్‌లాల్ నెహ్రూ, నాయకులు వీరన్న, బొల్లు రవి మృతుల కుటుంబాలను పరామర్శించారు.

క్రీడలకు సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట

క్రీడలతో శరీర దృఢత్వం పెంపొందుతుంది

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

ప్రారంభమైన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టాలెంట్‌హంట్ టోర్నీ

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రీడాకారులను ప్రోత్సహించడానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక నిధులు కేటాయించి క్రీడలకు పెద్దపీట వేస్తున్నారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ జేఎన్ఎస్‌లోని హ్యాండ్‌బాల్ కోర్టులో నాయిని విశాల్‌రెడ్డి మెమోరియల్ 7వ తెలంగాణ రాష్ట్రస్థాయి అండర్-15 బాలబాలికల హ్యాండ్‌బాల్ టాలెంట్ హంట్ క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రీడా పోటీలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిత్యం క్రీడల్లో పాల్గొనం ద్వారా శరీర దృఢత్వం పెంపొందడంతో పాటు ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపొచ్చన్నారు. వేల కోట్ల రూపాయలు ఉండి అనారోగ్యం బారిన పడిన వారికంటే ఆరోగ్యవంతులే మేలని, అది క్రీడల్లో పాల్గొనడం ద్వారానే సాధ్యం అవుతుందన్నారు. అదేవిధంగా క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడం ద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ నిస్వార్థంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి, వారిని ప్రోత్సహించడానికి ఇలాంటి టోర్నమెంట్లు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. పవన్‌కుమార్ స్ఫూర్తితోనే క్రీడాకారులు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే హితవు పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హ్యాండ్‌బాల్ ఆడి క్రీడాకారుల్లో నూతన ఉత్తేజాన్ని నింపారు.

తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న హ్యాండ్‌బాల్ టాలెంట్ హంట్ టోర్నీలో ఉమ్మడి పది జిల్లాల నుంచి 18బాలుర జట్లు, 9బాలికల జట్లతో పాటు 50మంది రెఫరీలు, కోచ్‌లు పాల్గొన్నారన్నారు. రాష్ట్ర స్థాయి టాలెంట్ హంట్ టోర్నీలో అత్యుత్తమ ప్రతిభ కనిబర్చిన క్రీడాకారులను గుర్తించి వేసవి కాలం ముగిసిన తరువాత ప్రత్యేక క్యాంపునకు ఎంపిక చేసి, నిష్ణాతులైన కోచ్‌ల పర్యవేక్షణలో శిక్షణా శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. ఎండ వేడిమి కారణంగా గతంలో కంటే ఈ టోర్నీలో జట్లు తక్కువగా పాల్గొన్నాయన్నారు. ఇందులో పాల్గొన్న క్రీడాకారులకు భోజన, బస వసతులను ఏర్పాటు చేయడంతో పాటు మండుతున్న ఎండల కారణంగా రాత్రి వేళల్లో ఫ్లడ్‌లైట్ల వెలుతుర్ల నడుమ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయితే క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమం ముందు కశ్మీర్‌లో ఉగ్రవాదులు దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన పర్యాటకులకు, దివంగత నాయిని విశాల్‌రెడ్డి ఆత్మలకు శాంతి చేకూరాలని అతిథులు, క్రీడాకారులు శ్రద్ధాంజలి ఘటించారు.



హ్యాండ్‌బాల్ క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

ఈ కార్యక్రమంలో 7వ డివిజన్ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్, హనుమకొండ, వరంగల్ జిల్లాల డీవైఎస్‌వోలు అశోక్‌కుమార్, సత్యవాణి, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు నగరబోయిన సాంబశివరావు, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బైరబోయిన కైలాస్‌యాదవ్, వివిధ జిల్లాల హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, రెఫరీస్, కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో.. 'సంస్థాగత' సందడి

(3వ పేజీ తరువాయి)

రాకపోతాయా అనే ఆశతో పదవుల పందేరంలోకి దిగుతున్నారు. ఇదిలా ఉంటే మారిన పరిస్థితుల దృష్ట్యా 2017 తర్వాత పార్టీలో చేరిన వారిలో కూడా చాలామంది తమకున్న పలుకుబడిని ఉపయోగించి పదవులు పొందేందుకు ప్రయత్నాలు చేస్తుండగా.. అధిష్ఠానం పెట్టిన నిబంధనలతో కొత్త వారి ఆశలు నెరవేరే పరిస్థితి లేదన్న చర్చ జరుగుతోంది.

జిల్లా అధ్యక్ష పదవులపై ఉత్కంఠ

కాంగ్రెస్ పార్టీలో మండల, బ్లాక్, జిల్లా అధ్యక్ష పదవులపై నేతల్లో పోటాపోటీ నెలకొంది. అయితే ప్రధానంగా జిల్లా అధ్యక్ష పదవులు ఎవరికి దక్కుతాయనే ఉత్కంఠ క్యాడర్‌లో నెలకొంది. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపికలోనూ డీసీసీ సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షినటరాజన్ గాంధీభవన్‌లో పేర్కొనటంతో అందరి దృష్టి డీసీసీ కమిటీలపై పడింది. దీంతో కొందరు నేతలు తమ వారసులను డీసీసీ పీఠాలపై కూర్చోపెట్టేందుకు ప్రయత్నాలు కూడా చేస్తుండటం రాజకీయాలు ఆసక్తికరంగా మారగా, 2017 నింబంధన కూడా మరికొందరికి ఇబ్బందికరంగా మారే పరిస్థితి ఉందనే చర్చ జరుగుతోంది. మొత్తంగా కాంగ్రెస్ పదవుల పందేరంలో ఎవరికి ఏ పదవి దక్కుతుందో అనే ఉత్కంఠ క్యాడర్‌లో నెలకొంది.

● భూపాలపల్లి జిల్లా అధ్యక్ష పదవిని పీసీసీ అధికార ప్రతినిధిగా ఉన్న గాజర్ల అశోక్ ఆశిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే నుంచి కూడా హామీ ఉందనే చర్చ జరిగింది. అయితే అశోక్ 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరి, పరకాల అసెంబ్లీ టికెట్ ఆశించారు. దీంతో 2017 నుంచి పార్టీలో ఉన్నవాళ్లకు ప్రాధాన్యం ఇవ్వాల్సి వస్తే.. ఇతర పేర్లు తెరపైకి వస్తున్నాయనే చర్చ ఉంది.

● జనగామ డీసీసీ పీఠాన్ని పాలకుర్తి ఎమ్మెల్యే అత్త మామిండ్ల ఝాన్సీరెడ్డి ఆశించారు. అయితే ఝాన్సీరెడ్డి కూడా 2023 ఎన్నికల ముందే క్రియాశీలక రాజకీయాల్లోకి వచ్చారు. దీంతో ఇక్కడ మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కుమారుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి పేరు తెరపైకి వస్తోంది. దీంతో ఝాన్సీరెడ్డికి జడ్పీ చైర్‌పర్సన్‌పై అధిష్ఠానం హామీ ఇవ్వాల్సి వస్తుందనే చర్చ జరుగుతోంది. తన వారసుడిని రాజకీయాల్లోకి తీసుకవచ్చేందుకు కొమ్మూరికి కూడా ఇదే అవకాశమని, ఇప్పటికే క్రియాశీలకంగా ఉన్న ప్రశాంత్‌రెడ్డికి డీసీసీ పగ్గాలు అప్పగిస్తారనే చర్చ మొదలైంది.

● ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవిపై మంత్రి సీతక్క కుమారుడు సూర్య పేరు వినిపిస్తుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో పినపాక అసెంబ్లీ స్థానం నుంచి పోటీకి గ్రౌండ్ సిద్ధం చేసుకోగా.. అయితే పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి రావటంతో ఆయన అనుచరులకు టికెట్ ఇవ్వాల్సి రావటంతో సూర్యకు అవకాశం రాలేదు. ఈ నేపథ్యంలో డీసీసీ పీఠంపై సూర్యను కూర్చోపెట్టాలని మంత్రి ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. ఒకవేళ సూర్య కాదంటే ప్రస్తుత అధ్యక్షుడిని కొనసాగించటమా లేక సీనియర్ నేత గొల్లపల్లి రాజేందర్‌కు ఇవ్వటమా లేక మరెవరికైనా ఇవ్వటమా అనేది మంత్రి సీతక్క చేతిలో ఉందనే చర్చ జరుగుతోంది.

● మహబూబాబాద్ జిల్లా నుంచి పలువురు కీలక నేతలు పోటీ పడుతున్నా.. ఓసీ వర్గం నుంచే అధ్యక్షుడిని చేసే ఆలోచనలో అధిష్ఠానం ఉన్నట్టు సమాచారం. ఈ జిల్లాలో నలుగురైదుగురు డీసీసీ పీఠంపై ఆశతో ఉన్నారు. అయితే స్థానిక ఎమ్మెల్యేలతో పాటు సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి ఆశీస్సులు ఉన్నవారికే పీఠం దక్కే ఛాన్స్ ఉందనేది సమాచారం.

● వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్ష పదవుల కోసం డజను మందికి పైగా ఆశావాహులున్నారు. వీరిలో చాలామంది రెండు దశాబ్దాల నుంచి పని చేస్తున్నవారు కూడా ఉన్నారు. వరంగల్‌జిల్లా డీసీసీ అధ్యక్ష పదవిపై ఉత్కంఠ నెలకొంది. మంత్రి కొండా సురేఖతో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి రాజకీయంగా వైరం ఉంది. ఈ నేపథ్యంలో ఇద్దరికి ఆమోదయోగ్యమైన వ్యక్తిని అధ్యక్షుడిగా ఎంపిక చేయటం పీసీసీ పరిశీలకులకు కత్తిమీద సామే అనే చర్చ జరుగుతోంది. ఇక హనమకొండ జిల్లా కమిటీ అధ్యక్ష పీఠం ఎవరికి దక్కుతుందో అనే ఉత్కంఠ కూడా ఉంది. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తన అనుచరుడికి అధ్యక్ష పదవి ఇప్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.



నేడు ప్రపంచ మలేరియా దినోత్సవం

మలేరియా తగ్గుముఖం

- ఉమ్మడి జిల్లాలో రెండంకెల్లోకి కేసుల సంఖ్య
- ఆరోగ్య, పంచాయతీ, మున్సిపల్ శాఖల కృషి ఫలితం
- ఏజెన్సీ ప్రాంతాల్లో ఇప్పటికీ కాస్త ఎక్కువగానే వ్యాప్తి
- ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే శాశ్వత నిర్మూలన

హనుమకొండ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లాలో మలేరియా క్రమంగా తగ్గుముఖం పడుతోంది. గతంతో పోల్చితే ప్రస్తుతం ఈ మలేరియా పూర్తిగా అదుపులో ఉంది. డెంగ్యూ కేసులు కొంత మేరకు పెరుగుతున్నా మలేరియా విషయంలో విజయం సాధించినట్టేనని వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు చెబుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉంటే మలేరియాను పూర్తిగా నిర్మూలించడం సాధ్యమేనని అంటున్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని ఏటా ఏప్రిల్ 25న నిర్వహిస్తారు. మలేరియా నిర్మూలన, ప్రజలలో అవగాహన కలిపించడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం. ప్రపంచ వ్యాప్తంగా 106 దేశాల్లో 3.3 మిలియన్ ప్రజలు మలేరియా బారిన పడుతున్నారు. 2007లో ప్రపంచ ఆరోగ్య సంస్థలోని సభ్య దేశాలన్నీ కలిసి ప్రపంచ మేలేరియా దినోత్సోవాన్ని నిర్ణయించాయి. ఈ సంవత్సరం 2025 ప్రపంచ మలేరియా దినోత్సవం ఇతి వృత్తం.. మలేరియా మనతోనే అంతమవుతుంది. తిరిగి పెట్టబడి పెట్టండి. తిరిగి ఊహించుకోండి. తిరిగి రగిలించండి. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో మలేరియా వ్యాప్తి, నమోదైన కేసులు, చికిత్స, నివారణకు తీసుకుంటున్న చర్యలపై కథనం.

తగ్గుతున్న మలేరియా కేసులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మలేరియా కేసులు నాలుగు సంవత్సరాలుగా క్రమంగా తగ్గుముఖం పడుతూ వస్తున్నాయి. ఏజెన్సీ ప్రాంతమైన ములుగు, అలాగే జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మాత్రం ఇప్పటికీ కాస్త ఎక్కువగానే నమోదు అవుతున్నాయి. హనుమకొండలో చాలా వరకు తగ్గిపోయాయి. 2030 నాటికి ఉమ్మడి జిల్లాలో మలేరియాను పూర్తిగా నిర్మూలించాలన్న లక్ష్యంతో వైద్య ఆరోగ్య శాఖ కృషి చేస్తోంది. ఈ మేరకు పక్కా ప్రణాళికతో చర్యలు తీసుకుంటోంది. గతంలో మలేరియా కేసులు నమోదైన ఉమ్మడి జిల్లాలో వాటి సంఖ్య రెండంకెలకే పరిమితం కావడమే ఇందుకు ఉదాహరణ. హనుమకొండ జిల్లాలో 2022లో 26 మలేరియా కేసులు నమోదవగా.. 2023లో 12 కేసులు రికార్డయ్యాయి. 2024లో వాటి సంఖ్య నాలుగుకే పరిమితం అయింది. జనగామ జిల్లాలో 2022లో 7, 2023లో 4, 2024లో 6 కేసులు , మహబూబాబాద్ జిల్లాలో 2024లో 11 కేసులు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మలేరియా వ్యాప్తి కాస్త అధికంగానే ఉంది. ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు 10మలేరియా కేసులు నమోదయ్యాయి. వరంగల్ జిల్లాలో గతేడాది 3 మలేరియా కేసులు నమోదవగా ఉమ్మడి జిల్లాలో డెంగీ కేసులు మాత్రం ఏటా ఆందోళన కలిగించే స్థాయిలో నమోదు అవుతున్నాయి. గత సంవత్సరం మహబూబాబాద్ జిల్లాలో 419 కేసులు నమోదు అయ్యాయి. ఒక్క జనగామ జిల్లాలో 102 రికార్డయ్యాయి

ఏజెన్సీ ఏరియాలో..

ములుగు ఏజెన్సీ ప్రజలు ముఖ్యంగా గొత్తికోయ గూడెలలో ఏటా మలేరియా, డెంగీ పెద్ద ఎత్తున ప్రబలుతున్నాయి. అత్యధిక అటవీ ప్రాంతం ఉన్న ములుగు ఏజెన్సీలో సీజనల్ వ్యాధులు ప్రబలడం పరిపాటి. అయితే మండు వేసవిలో కూడా మలేరియా కేసులు నమోదు కావడం ఆందోళనకు కలిగిస్తోంది. తాడ్వాయి, కాటాపూర్, కొడిశాల, కన్నాయిగూడెం, వెంకటాపూర్, నాయినిగూడెం, పస్రా తదితర ప్రాంతాల్లో ఏటా ప్రబలడం సర్వసాధారణం. ఐలాపూర్, ఎడ్జర్లపల్లి, పెనుగోలు, రాపట్ల తదితర గ్రామాలు చిట్టచివరన ఉంటాయి. ఇక్కడికి వెళ్లడమే కష్టం. దీనితో ఈ ప్రాంతాల్లో ప్రబలిన మలేరియా, డెంగీ కేసులు ఆలస్యంగా వెలుగుచూస్తుంటాయి.

వర్షాకాలం వచ్చిందంటే..

వర్షాకాలం వచ్చిందంటే దోమలు, నీటి సంబంధిత కారణాల వ్యాధులు వ్యాపిస్తుంటాయి. మలేరియా, డయేరియా, డెంగీ, టైఫాయిడ్ తదితర జబ్బుల బారిన పడడం ఏటా జరుగుతూనే ఉంది. మలేరియాకు దోమలే ప్రధాన కారణమైనా వాటి పగడ్బందీ నిర్మూలనకు తగిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు నిల్వ ఉండే చోట దోమలు వృద్ధి చెందే అవకాశం ఉన్నా, అక్కడ పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉన్నా పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యశాఖలు పెద్దగా పట్టించుకోవడం లేదు. మలేరియా దోమకాటు వల్ల సోకుతుంది. మలేరియా ప్లాస్మోడియం జాతికి చెందిన ఏకకణ పరాన్న జీవి వల్ల కలిగే వ్యాధి. ఈ పరాన్న జీవి సోకిన దోమల కాటు ద్వారా మానవులకు వ్యాపిస్తుంది. మలేరియా ఉన్నవారు సాధారణంగా అధిక జ్వరం, చలితో వణుకుతూ చాలా అనారోగ్యంగా బాధపడుతుంటారు. మలేరియా సోకినవారిలో శ్వాస, హృదయ స్పందనలు కూడా ఎక్కువగా ఉంటాయి. చికిత్స ఆలస్యమైతే మలేరియా తీవ్రమై రక్తహీనత, సెరిబ్రల్ మలేరియా, కోమా, లేదా మరణం లాంటి తీవ్రమైన సమస్యలు సంభవించవచ్చు. అందుకే దోమకాటుకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటే మలేరియాకు దూరంగా ఉండవచ్చని వైద్యులు చెబుతున్నారు. పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యమని, దీనిపై అవగాహన పెంచుకోవాల్సి అవసరం ఉందని సూచిస్తున్నారు.

మలేరియా నిర్మూలనకు విస్తృత చర్యలు

డాక్టర్ మదన్ మోహన్‌రావు, అదనపు జిల్లా వైద్యశాఖాధికారి, హనుమకొండ



మలేరియా నిర్మూలనకు ప్రణాళికా బద్ధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అందువల్లే గతం కన్నా కేసుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ములుగు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో వ్యాప్తి కాస్త ఎక్కువగానే ఉన్నా మిగతా జిల్లాలో అంతగా లేవు. హనుమకొండ జిల్లానే తీసుకుంటే గతేడాది పట్టణ గ్రామీణ ప్రాంతాలను కలుపుకుంటే నమోదైన మలేరియా కేసులు నాలుగే. మిగతా జిల్లాల్లో కూడా ఇంచుమించు ఇదే పరిస్థితి ఉంది. 2030 నాటికి మలేరియా అంతమే లక్ష్యంతో పని చేస్తున్నాం. కేసులు తక్కువగా నమోదవతున్న జిల్లాల్లో ఉమ్మడి వరంగల్ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంది. మలేరియాను అరికట్టేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖతో పాటు పంచాయతీరాజ్, నగరపాలక సంస్థ, మున్సిపాలిటీలతో సమన్వయం చేసుకుంటూ సంయుక్త కార్యాచరణ అమలు చేస్తున్నాం. మరికొద్ది రోజుల్లో గతంలో మలేరియా, డెంగ్యూ కేసులు నమోదు ప్రాంతాల్లో అసిమ్టామాటిక్ మలేరియా సర్వే నిర్వహించబోతున్నాం.

చిత్తశుద్ధి ఉంటే హామీలన్నీ నెరవేర్చాలి

- సభలో పల్లీలు, బఠానీలు అమ్ముకునేంత మంది లేరు కాంగ్రెస్‌లో..
- రాష్ట్ర ప్రజలకు బీఆర్‌ఎస్సే శ్రీరామ రక్ష
- జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కవిత
- ఎల్కతుర్తిలో రజతోత్సవ సభ ఏర్పాట్ల పరిశీలన



మీడియాతో మాట్లాడుతున్న కవిత, చిత్రంలో బీఆర్‌ఎస్ నేతలు

ఎల్కతుర్తి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఈనెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభ ఏర్పాట్లను ఆమె గురువారం పరిశీలించారు. సభ ప్రాంగణం, వేదిక, పార్కింగ్ స్థలాల వివరాలను అడిగి తెలుసుకున్న అనంతరం బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు బీఆర్‌ఎస్ నిత్యం శ్రీరామరక్షగా ఉంటుందని, తెలంగాణ సాధన కోసం కేసీఆర్ చేసిన పోరాట చరిత్రను నెమరవేసుకుంటూ 25 వసంతాల పండుగను జరుపుకోవడానికి ఎల్కతుర్తి వేదికైందన్నారు. 1969లో హింసతో అంతమైన ఉద్యమాన్ని, పిడికెడు మందిలో ఒకరైన ప్రొఫెసర్ జయశంకర్ సార్ లాంటి వారు కాపాడుతూ వచ్చిన ఉద్యమాన్ని ప్రజలకు పరిచయం చేసిన వ్యక్తి కేసీఆర్ అన్నారు. అస్తిత్వం అదృశ్యమై తెలంగాణ వాదులు సైతం ఉద్యమాన్ని మర్చిపోతున్న సమయంలో కేసీఆర్ పిడికిలి బిగించి రాష్ట్ర సాధనకు శ్రీకారం చుట్టి బయటకు వచ్చారని, తెలంగాణ యాస, భాష, పాట, పండుగలు, సంబరాలు, తెలంగాణ తల్లిని ప్రజలకు పరిచయం చేసి వారిలో స్ఫూర్తిని నింపడానికి 14 ఏళ్లు పట్టిందన్నారు. ఒక్క రక్తం చుక్క చిందించకుండా తెలంగాణ సాధిస్తానని చెప్పి.. చేసి చూపారన్నారు. ఉద్యమ సమయంలో పుట్టిన పిల్లలు.. నేడు ఓటు హక్కును వినియోగించుకునే స్థాయికి ఎదిగారని, తెలంగాణ చరిత్ర తెలిసినోళ్లే భవిష్యత్తును తెలుసుకోగలుగుతారన్నారు. ఎల్కతుర్తిలో జరుపుకునే గులాబీ పండుగ తెలంగాణ యువతలో స్ఫూర్తి నింపనుందని, వరంగల్ గడ్డ ఎంతో పవిత్రమైందని, జాతీయ స్థాయి నాయకులను కదిలించి తెలంగాణ ఉద్యమానికి మద్దతునిచ్చేలా చేసిందన్నారు. అలాంటి ఓరుగల్లులో భాగమైన ఎల్కతుర్తిలో జరిగే చరిత్రలో మరో మైలురాయిగా నిలిచి పోనుందన్నారు. కుంభమేళా తరహాలో జరిగే ఈ సభకు కాంగ్రెస్ చేతిలో వంచనకు గురైన బిడ్డలు తరలి రావాలని పిలుపునిచ్చారు. తమ హయాంలో రైతులు గుండెలపై చేయి వేసుకుని నిద్రపోయే పరిస్థితిని కేసీఆర్ కల్పించారని, వరప్రదాయని అయిన కాళేశ్వరం ప్రాజెక్టును నిర్వీర్యం చేసి లక్షల ఎకరాలు ఎండ బెట్టి కాంగ్రెస్ రైతులను మోసగించిందని మండిపడ్డారు. వంచనకు గురైన రైతులు గులాబీ దండులా కదిలి కాంగ్రెస్ గుండెల్లో గుబులు పుట్టించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసాలకు గురికాని వారంటూలేరని.. కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలంటే కన్నబిడ్డలనే భావనే తప్ప ప్రజలు, ఓటర్లు అనే భావన ఉండదన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు మాత్రం ప్రజలను ఓటర్లుగానే భావిస్తారని సూచించారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న నాయకులు బీఆర్‌ఎస్ సభలో పల్లీలు, బఠానీలు అమ్ముకునేంత మంది ఉండరన్నారు. 2004లో గులాబీ కండువాతో పొత్తు పెట్టుకుని తెలంగాణ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ 14 ఏళ్లు ఆలస్యం చేసి వందలాది మంది చనిపోవడానికి కారణమైందని, తెలంగాణను ప్రేమతో ఇవ్వలేదని తప్పని పరిస్థితుల్లో ఇచ్చారని వ్యాఖ్యలు చేశారు. వారి కుట్రలను ఈ సభ ద్వారా ఎండగట్టాల్సిన అవసరం ఉందన్నారు. 16నెలల కాలంలోనే కాంగ్రెస్ మోసాలను ప్రజలు తెలుసుకున్నారన్నారని, మునిసిపాలిటీలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్, మార్కెట్ కమిటీల్లో ప్రవేశాలు కల్పించి చైర్మన్, వైస్ చైర్మన్లను చేసింది కేసీఆర్ ప్రభుత్వమేనన్నారు. ఎస్సీ, బీసీ, ఎస్టీ, ఆడబిడ్డలకు 33 జిల్లాల పరిధిలో వసతి గృహాలతో కూడిన డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేసింది కేసీఆరే అని, అలాగే మహిళలకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ఇంటింటికి అందజేశారని గుర్తుచేశారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లను సైతం మహిళ పేర రిజిస్ట్రేషన్ చేయించి అప్పగించి వారికి అండగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, ఎమ్మెల్సీలు తక్కళ్ళపెల్లి రవిందర్‌రావు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బాలమల్లు, హనుమకొండ జిల్లా పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీష్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, రైతు విమోచన సమితి మాజీ చైర్మన్ నాగుర్ల వెంకన్న, రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, పేర్యాల రవిందర్‌రావు, చింతం సదానందం, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మహిళా నాయకులతో కలిసి సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కవిత

మావోయిస్టులు లొంగిపోవాలి

- రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుంది..
- మల్టీజోన్ -1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి
- 14 మంది ఛత్తీస్‌గఢ్ మావోయిస్టుల లొంగుబాటు
- ఒక్కొక్కరికి రూ.25 వేల నగదు రివార్డు అందజేత



మీడియాతో మాట్లాడుతున్న ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, సీపీ, ఎస్పీలు; చిత్రంలో రివార్డు అందుకున్న నక్సలైట్లు

వరంగల్ క్రైం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీసుల సమక్షంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలకు ఆకర్షితులై జనవరి నుంచి ఇప్పటి వరకు 250మంది మావోయిస్టులు లొంగిపోయారని, మిగతావారు కూడా వెంటనే లొంగిపోవాలని మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన 14 మంది మావోయిస్టులు గురువారం లొంగిపోయినట్లు తెలిపారు. గురువారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఐజీ వివరాలు వెల్లడించారు. రాష్ట్ర సరెండర్ పాలసీ నచ్చి 14 మంది లొంగిపోయారని, వారందరినీ జనజీవన స్రవంతిలోకి ఆహ్వానిస్తున్నామన్నారు. 14 మందిలో ఇద్దరు ఏరియా కమిటీ సభ్యులు, ఏడుగురు పార్టీ సభ్యులు, నలుగురు మిలిషీయా సభ్యులు, ఒక్కరు మిలిషీయా కమాండర్ ఉన్నాడన్నారు. పునరావాసం కింద ఏసీఎం ర్యాంకు వారికి ఒక్కొక్కరికి రూ.4 లక్షల రివార్డు, నలుగురు పార్టీ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.లక్ష అవార్డు, మిగతా సభ్యులకు ఒక్కొక్కరికి రూ.25 వేల అవార్డును అందజేస్తామన్నారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన గాలికొండ ఏరియా కమిటీ మెంబర్ మడవి అంద అలియాస్ రాజేశ్, కేంద్ర కమిటీ సభ్యుడు గాజర్ల రవికి చెందిన ప్రొటెక్షన్ టీమ్‌లో పనిచేసిన ఏరియా కమిటీ సభ్యురాలు సోడి కోసి, డివిజన్ కమిటీల్లో పనిచేసిన మరకం హిడుమే, మడకం జోగి అలియాస్ కోవాసి జోగి, పోడియం భూమిక అలియాస్ సోడి కోసి అలియాస్ వెన్నెల, సోడి బుద్రి అలియాస్ బద్రీ, మడవి పూజే, హేమ్లా, సోనూ, సోడి రమేశ్ అలియాస్ భీమా మిలిషీయా సభ్యులుగా పనిచేసిన అట్టం బుద్ర, కోవాసి ఇడుము, కోర్సా లాలు, హేమ్లా సుక్కు అలియాస్ అర్జున్, కోర్సా సుక్కు. గురువారం లొంగిపోగా తక్షణ సహాయం కింద ఒక్కొక్కరికి రూ.25 వేల నగదును అందజేశామన్నారు. ఏసీఎం, పార్టీ సభ్యులకు అందజేయాల్సిన మిగతా రివార్డు డబ్బులు వారి అకౌంట్‌లోకి పంపిస్తామన్నారు.

తెలంగాణలో లొంగిపోయిన వారిపై ఎలాంటి కేసులు నమోదు కాలేదని ఐజీ పేర్కొన్నారు. తెలంగాణ నుంచి ఇంకా 94 మంది అజ్ఞాతంలో ఉన్నారని, వారు కూడా జనజీవన స్రవంతిలో కలిస్తే పోలీస్‌శాఖ అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందజేస్తుందన్నారు. పక్క రాష్ట్రాల వారు వచ్చినా ఆహ్వానించి పునరావాసం కింద జీవనోపాధి కల్పిస్తామన్నారు. లొంగిపోవాలనుకేనే వారు ఎలాంటి భయాందోళన లేకుండా నేరుగా వచ్చి కలవచ్చన్నారు. కర్రెగుట్టలపై జరుగుతున్న పోలీసు ఆపరేషన్‌తో తెలంగాణ పోలీసులకు ఎలాంటి సంబంధంలేదని ఈ సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఐజీ బదులిచ్చారు. కేంద్ర బలగాలు, ఛత్తీస్‌గఢ్ పోలీసులు పహారాలో జరుగుతోందన్నారు. కాల్పుల విరమణ అనేది ప్రభుత్వం తీసుకోవాల్సిన నిర్ణయమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ సన్‌ప్రీత్ సింగ్, భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే, ములుగు ఎస్పీ శబరీష్, కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజ్, ఏఎస్పీ మనాన్‌భట్ తదితరులు పాల్గొన్నారు.

రంగస్థల రారాజు దేవరాజు

- పద్య నాటకాలతో ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర
- బాల్యం నుంచే విభిన్న పాత్రల్లో రాణిస్తున్న రవీందర్‌రావు

వడ్డెపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : పద్యనాటకాలంటే ఆయనకు పంచప్రాణాలు. రంగస్థల రారాజుగా 30 వసంతాలు పూర్తి చేసుకున్న దేవరాజు రవీందర్‌రావు విభిన్న పాత్రలు పోషించి ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేశారు. కమలాపురం మండలం మాధన్నపేట గ్రామానికి చెందిన దేవరాజు లక్ష్మణ్‌రావు- శాంతాదేవి దంపతులకు 1971లో జన్మించిన రవీందర్‌రావు ప్రాథమిక విద్యను మాధన్నపేటలో చదివారు. ఇక ఎంఏ పూర్తి చేసిన ఆయన హుజురాబాద్ ఆర్‌డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుగా విధులను నిర్వర్తిస్తున్నారు. తన తండ్రి లక్ష్మణ్‌రావు కూడా రంగస్థల నటుడు కాగా.. కృష్ణుడు, అర్జునుడు, కర్ణుడి పాత్రలను పోషించి గత ఐదు దశాబ్దాల పాటు ప్రేక్షకుల ఆదరాభిమానాలను చూరగొని ఔరా అనిపించుకున్నారు. రవీందర్‌రావు సోదరులు రాజేంద్రప్రసాద్‌రావు, రాఘవేందర్‌రావు కూడా కళాకారులే కావడం గమనార్హం.

బాల నటుడిగా అరంగేట్రం..

తన 12వ ఏటా 1992లో భక్త ప్రహ్లాద నాటకంలో లీలావతిగా అభినయాన్ని ప్రారంభించిన దేవరాజు రవీందర్‌రావు అల్లూరి సీతారామరాజుగా వికర్ణుడిగా పాత్ర పోషించి మెప్పించారు. హనుమకొండ , వరంగల్ తదితర ప్రాంతాల్లోని నాటక సమాజాల్లో తన నటన కౌశల్యాన్ని ప్రదర్శించి మెప్పించారు. గయోపాఖ్యానంలో అర్జునుడిగా, శ్రీనివాస కల్యాణంలో శ్రీవేంకటేశ్వరస్వామిగా, శ్రీకృష్ణ రాయబారంలో అర్జునుడిగా, శ్రీకృష్ణుడిగా, దుర్యోధనుడిగా, లవకుశ నాటకంలో శ్రీరాముడిగా, చింతామణి నాటకంలో భవాని శంకరుడిగా, బిల్వ మంగళుడిగా పాత్రలను అవలీలగా పోషించి ప్రేక్షక సమాజంతో చప్పట్లు కొట్టించుకొని ఆద్యంతం ఆకట్టుకున్నారు. రవీందర్‌రావు పద్యాల ఆలాపనకు నాటకాన్ని వీక్షించడానికి వచ్చిన ప్రేక్షకులు కొట్టిన వన్స్‌మోర్‌లతో నాటక ప్రదర్శన మందిరం మార్మోగేది. రెండున్నర నుంచి నాలుగున్నర శృతిలో కల్యాణి, భీంక్లాస్ , మాండు, మధ్యమావతి, వలజ, చక్రవాకం, అమృతవ ర్షిణి రాగాలతో ఆయన ఆలాపించే పద్యాలు ఆబా ల గోపాలాన్ని అలరింపజేశాయి. పాత్రలో లీన మై ఆద్యంతం అలరించే ఆహార్యంతో నటనను ప్రదర్శించే దేవరాజు రవీందర్‌రావు రంగస్థల నటుడిగా ప్రజలందరికి సుపరిచితుడే.



శ్రీకృష్ణుడి పాత్రలో..



వేంకటేశ్వరస్వామిగా..



దుర్యోధనుడిగా



లవకుశ నాటకంలో రాముడి పాత్రలో రవీందర్‌రావు (ఫైల్)

ఎన్నో అవార్డులు, రివార్డులు..

ఓరుగల్లుతో పాటు వేములవాడ, తిరుపతి, విజయవాడ నాటక సమాజాలతో కలిసి ఆయన విభిన్న పాత్రలను పోషించి ఆకట్టుకున్నారు. ఈ క్రమంలో ఆయన తిరుపతిలో అభినయ ఆర్ట్స్‌లో ప్రదర్శించి ఉత్తమ నటుడి అవార్డు, వరంగల్‌లో జాతీయ స్థాయి గరుడ అవార్డు, బంగారు గరుడ - ఉత్తమ నటుడి అవార్డు, తిరుపతిలో శ్రీనారాయణరెడ్డి - గుమ్మడి గోపాలకృష్ణ , చాట్ల శ్రీరాములు తదితరులతో ఎన్నో సన్మానాలు, సత్కారాలను పొందారు.



అర్జునుడిగా..

నాటక సమాజాలను పోషించాలి

దేవరాజు రవీందర్‌రావు, వరంగల్ స్టార్ బ్రదర్స్ సాంస్కృతిక కళా పరిషత్ అధ్యక్షుడు



నాటక సమాజాలతో పాటు రంగస్థలంలో నటించే నటులను ప్రభుత్వమే పోషించాలి. మండల స్థాయిలో కళాక్షేత్రాలను ఏర్పాటు చేసి కళాకారులకు శిక్షణ ఇప్పించి కళారంగం అంతరించిపోకుండా చూడాలి. రాష్ట్ర స్థాయి అవార్డులను ప్రదానం చేసి రంగస్థల నటులను ప్రభుత్వమే పోత్సహించాలి. వృద్ధ కళాకారులకు నెలకు రూ.12వేలు ఇవ్వాలి. ఇంటి స్థలాలు కేటాయించి, ఇల్లు ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలి.

సుర్రుమంటోంది..

- ఉమ్మడి జిల్లాలో భానుడి భగభగలు
- భూపాలపల్లి జిల్లాలో అత్యధికం
- 43.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

హనుమకొండ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఎండ సుర్రుమంటోంది. భానుడి భగభగలకు ఉమ్మడి వరంగల్ జిల్లా వాసులు బెంబేలెత్తిపోతున్నారు. ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. మూడు, నాలుగు రోజులుగా ఉమ్మడి జిల్లాలో సరాసరి అత్యధిక పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా.. గురువారం రికార్డుస్థాయిలో 43డిగ్రీలను దాటింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. ఈ జిల్లాలోని రికార్డు స్థాయిలో చిట్యాలలో 43.7 డిగ్రీలు, హనుమకొండ జిల్లా దామెరలో 43.6 డిగ్రీలు, జనగామ జిల్లా బచ్చన్నపేటలో 43.4డిగ్రీలు, ములుగు జిల్లా కన్నాయిగూడెంలో 43.8 డిగ్రీలు, మహబూబాబాద్ జిల్లా కొత్తగూడెంలో 42.9 డిగ్రీలు, వరంగల్ జిల్లా ఉర్సులో 42.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండల తీవ్రత వల్ల ఉమ్మడి జిల్లాలో వడదెబ్బ మరణాలు కూడా పెరుగుతున్నాయి. ఉపాధి కూలీలు, వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, పిల్లలు విలవిలలాడుతున్నారు. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు.



ఎండ నుంచి రక్షణగా వస్త్రాలు కప్పుకొని కాజీపేట ఫాతిమా బ్రిడ్జి పైనుంచి వెళ్తున్న ఓ కుటుంబం

ఇదేం ఘా'తూకం'?

రేషన్ షాపుల్లో డీలర్ల చేతివాటం • గోనె సంచులతోనే కాంటా వేస్తున్న వైనం



నార్లాపూర్‌లో గోనె సంచితో బియ్యం తూకం వేస్తున్న డీలర్

తాడ్వాయి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ప్రతిష్ఠాత్మకంగా పంపిణీ చేస్తున్న సన్న బియ్యం సరఫరాల్లో డీలర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నట్టు విమర్శలు వెలువడుతున్నాయి. బియ్యం సరఫరా సమయంలో గోనె సంచితో తూకం వేస్తున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. గోనె సంచి బరువు సుమారు 650 గ్రాములకు పైగా ఉంటుందని, దానితోనే తూకం వేస్తూ మోసగిస్తున్నారని అంటున్నారు. ఒక్కో లబ్ధిదారుడికి ఆరు కిలోల బియ్యం చొప్పున పంపిణీ చేస్తుండగా వారికి తక్కువగా లభిస్తోందని విమర్శిస్తున్నారు. తక్కువగా తూకం వేసిన ఆ బియ్యం ఎవరికి చేరుతున్నాయోనని ప్రశ్నిస్తున్నారు. ఈ-పాస్ మిషన్(బయోమెట్రిక్)లో రేషన్‌కార్డు నంబరు నమోదు చేసి లబ్ధిదారుడు వేలు పెట్టగానే పేరు వచ్చే బియ్యం సమాచారం కనిపిస్తుంది. వెంటనే డీలర్ ఎలక్ట్రానిక్ క్యాంటాకు కలిపి బియ్యం తూకం వేసి లబ్ధిదారుడికి ఇవ్వాల్సి ఉంటుంది. అయితే.. రేషన్‌షాపుల్లో గోనె సంచి సహా తూకం వేసి అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కాంటాపై గోనె సంచితో బియ్యం తూకం వేసి, నేరుగా లబ్ధిదారుల సంచిలో వేసి పంపిస్తూ బోల్తా కొట్టిస్తున్నారని అంటున్నారు. ఇదేమిటని డీలర్లను అడిగితే రెండు మూడుసార్లు షాప్ చుట్టూ తిప్పుకుంటున్నారని తెలుపుతున్నారు. అంతే కాకుండా.. 50కేజీల బియ్యానికి బస్తాలో 48కేజీలు మాత్రమే వస్తున్నాయని, ఈ నష్టాన్ని ఎవరు భరిస్తారని ప్రశ్నిస్తున్నారు. అయితే... తాడ్వాయి మండల వ్యాప్తంగా 19వేల 9వందల 42మందికి 23 రేషన్ షాపుల ద్వారా 6వేల 8వందల 4 ఆహార భద్రత కార్డులకు లక్ష 51వేల 608 కిలోల సన్న బియ్యం సరఫరా అవుతున్నాయి. డీలర్ చేతివాటంతో ఒక్కొక్కరికి 650గ్రాముల బియ్యం నష్టం జరుగుతుందని అంటున్నారు. వెంటనే అధికారులు చర్యలు చేపట్టి పేద ప్రజలకు పూర్తిస్థాయిలో సన్నబియ్యం అందేలా చూడాలని లబ్ధిదారులు కోరుకుంటున్నారు.

ఎప్పుడు వస్తున్నారో.. ఎప్పుడిస్తారో తెలియదు..

డీలర్లు రేషన్ షాపుల్లో బియ్యం ఎప్పుడు ఇస్తున్నారో తెలియడం లేదని బియ్యం లబ్ధిదారులు అంటున్నారు. నెల మొదటి రోజు నుంచి పది రోజుల వరకు కూడా షాపు చుట్టూ కక్కుర్లు కొడుతున్నమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో డీలర్లు దండోరా వేయించేవారని, ఇప్పుడు సమాచారం తెలియడం లేదని అంటున్నారు.

శిథిలావస్థలో రేషన్ షాపులు

మండలంలోని 23 రేషన్ షాపులు ఉన్నాయి. వాటిలో సగానికి పైగా శిథిలావస్థలోకి చేరుకున్నాయి. ప్రస్తుతం అక్కడ నుండే లబ్ధిదారులకు బియ్యం సరఫరా అవుతున్నాయి. కొన్ని షాపుల్లో కరెంటు సమస్యలు, మరికొన్నింటిలో తులుపులు, కిటికీల సమస్యలు, ధ్వంసమై ప్లాట్ ఫామ్‌లతో ఉన్నాయి.

అంగన్‌వాడీ సెంటర్లకు వేసవి సెలవులు ఇవ్వాలి

సీఐటీయూ ఆధ్వర్యంలో అధికారులకు వినతి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ సెంటర్లకు వేసవి సెలవులు ఇవ్వాలని కోరుతూ అంగన్‌వాడీలు సీఐటీయూ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ సి.హెచ్.మహేందర్‌జీ, డీడబ్ల్యూవో శిరీషకు గురువారం వేర్వేరుగా వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ మాట్లాడుతూ ఎండలు రోజురోజుకూ పెరుగుతున్న దృష్ట్యా ప్రభుత్వ పాఠశాలలతో సమానంగా అంగన్‌వాడీ సెంటర్లకు వేసవి సెలవులు ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.సమ్మక్క, అంగన్‌వాడీలు భాగ్యలక్ష్మి, సరిత, జమునారాణి, లక్ష్మీనర్సమ్మ, విజయలక్ష్మి, ఈశ్వరి, రుక్మిణి, సత్యనారాయణమ్మ, హంస రేఖ, మీనా, సత్తెమ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి : డీఎంహెచ్‌వో

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి గోపాల్‌రావు అన్నారు. ధరల పట్టికలు, సేవలందించే వైద్యుల పేర్లను తప్పని సరిగా ప్రదర్శించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బయో మెడికల్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ సర్టిఫికెట్, ఫైర్ సర్టిఫికెట్ ఉండాలని, లేనట్లయితే రూ.10వేల నుంచి రూ.5లక్షల వరకు జరిమానా విధిస్తామన్నారు. పీసీపీఎన్‌డీ యాక్ట్ ప్రకారం లింగ నిర్ధారణ చేసినట్లయితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరిం చారు. అదేవిధంగా ప్రతినెల ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌లలో నిర్వహించిన వైద్య సేవలను హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టంలో 5వ తేదీలోపు నమోదు చేయాలన్నారు. రాబోయే వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ పరీక్షలు చేసినప్పుడు పాజిటివ్‌గా నిర్ధారణ అయితే జిల్లా కార్యాలయానికి సమాచారం అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి శ్రీకాంత్, వైద్యాధికారులు రణధీర్, డెమో సంపత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌లు పూర్ణ, సంపత్‌రావు, ఎస్‌వో స్వరూపరాణి, మానిటరింగ్ సూపర్‌వైజర్ సురేష్‌బాబు, డీఈవో నిఖిల్, ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు పాల్గొన్నారు.

గొత్తికోయలకు తాగునీటి సౌకర్యం

తాడ్వాయి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బయ్యక్కపేట గ్రామ పంచాయతీ పరిధిలోని ముసలమ్మ గొత్తికోయగూడెంలో మండల పంచాయితీ అధికారి జాల శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో తాగునీటి సౌకర్యాన్ని గురువారం ఏర్పాటు చేశారు. సింథటిక్ ట్యాంక్‌ను ఏర్పాటు చేసి పంచాయతీ ట్రాక్టర్ ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేశారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ దివాకర ఆదేశాల మేరకు ఈ సౌకర్యం కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నవీన్, పంచాయతీ కార్యదర్శి జ్ఞానేశ్వరి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంజన్న భక్తుల నగర సంకీర్తన

మంగపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కమలాపురంలో అంజన్న మాలధారులు, భక్తులు గురువారం నగర సంకీర్తన నిర్వహించారు. ఆటోస్టాండ్ నుంచి బిల్ట్ ఫ్యాక్టరీ ప్రధాన గేటు వరకు ఇది కొనసాగింది. అనంతరం గ్రామ సమీపంలోని శ్రీ ప్రసన్నంజనేయాస్వామి దేవాలయంలో దాతలు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంజన్న మాల గురుస్వాములు ఆకుల ప్రభాకర్ స్వామి, నూకల రాజేష్‌స్వామితో పాటు సుమారు 50 మంది మంది భక్తులు పాల్గొన్నారు.24 ఎంజిపిటి, 01: కత్తిగూడెంలో జరిగిన గ్రామసభలో పాల్గోన్న అధికారులు

ఇసుక క్వారీ ఎంపికపై గ్రామసభ

మంగపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కత్తిగూడెం గ్రామ పంచాయతీ ఆవరణంలో గురువారం గోదావరిలో ఇసుక క్వారీ నిర్వహణపై పెసా గ్రామసభను నిర్వహించారు. గ్రామంలో 12 మంది గిరిజనులు ఉండగా అందరూ హాజరయ్యారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణాజీ అధ్యక్షతన ఈ గ్రామ సభ జరగ్గా ఎంపీడీవో బి. భద్రు, గ్రామ ప్రత్యేక అధికారి భిక్షపతి హాజరయ్యారు. సభ్యులందరూ ఆమోదం తెలపగా శ్రీ అంజనేయ ట్రైబల్ సొసైటీకి ఈ క్వారీ దక్కింది. ఈ కార్యక్రమంలో పెసా గ్రామ మొబిలైజర్ పున్నం శ్రవణ్, ఉపాధ్యక్షుడు బాడిశ ఆదినారాయణతో పాటు కమిటి సభ్యులు పాల్గోన్నారు.

బీఆర్ఎస్ మహాసభకు తరలిరావాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మహదేవపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు భారీగా తరలిరావాలని ఆ పార్టీ మహిళా విభాగం మంథని నియోజకవర్గ అధ్యక్షురాలు కేదారి గీత అన్నారు. ఈనెల 27న వరంగల్‌లో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ పోస్టర్‌ను మండల కేంద్రంలో గురువారం ఆవిష్కరించారు. బహిరంగ సభకు ఊరూవాడా కదలి విజయవంతం చేయాల న్నారు. ఈ కార్యకరమంలో మాజీ సర్పంచ్ శ్రీపతి బాపు, బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు కూరతోట రాకేష్, మహిళా అధ్యక్షురాలు ఓడేటీ స్వప్న, కాళేశ్వరం దేవస్థాన మాజీ చైర్మన్ పోత వెంకటస్వామి, నాయకులు మెరుగు శేఖర్, కూరతోట శ్రీహరి, అనకార ప్రకాష్, వెన్నంపల్లి మహేష్, తడకల రమేష్, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైకి మురికి నీరు.. ప్రజలు బేజారు



రోడ్డుపై పారుతున్న మురికినీరు

కాటారం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మసీదువాడలో రోడ్డుపై నుంచి మురికినీరు ప్రవహిస్తూ కంపుకొడుతోంది. డ్రెయినేజీలు సరిగా లేకపోవడం, ఉన్న వాటిని కూడా శుభ్ర పర్చకపోవడంతో మురికినీరు రోడ్డుపైకి వస్తోందని జనం అంటున్నారు. వాడలోని మురికినీరు వెళ్లే మార్గం లేక ఈ సమస్య తలెత్తిందని అంటున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

రజతోత్సవను విజయవంతం చేయాలి



సింగరేణి కార్మికులతో మాట్లాడుతున్న సిరికొండ ప్రశాంత్

కృష్ణకాలనీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సింగరేణి కార్మికులు భారీగా తరలిరావాలని ఆ పార్టీ యువజన విభాగం రాష్ట్ర నాయకులు సిరికొండ ప్రశాంత్ అన్నారు. భూపాలపల్లి సింగరేణి ఏరియా పరిధిలో 1వ గనిలో కార్మికులను కలిసి సభకు రావాలని ఆయన కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల్ని ఎండగట్టాలన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే అన్ని వర్గాలకు సముచిత న్యాయం కలిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కేటీకే 1 ఇన్‌క్లైన్ ఫిట్ సెక్రటరీ అన్నాడి మల్లారెడ్డి, నాయకులు శశికాంత్‌గౌడ్, పొన్నం మొగిళి, ఏరియా అధికార ప్రతినిధి సుంకరి గోవర్ధన్, నాయకులు శ్రీనివాస్, శ్రీకాంత్, అనిల్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి పాఠశాలలో ఉచితంగా స్పోకెన్ ఇంగ్లీష్

కృష్ణకాలనీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కారల్ మార్క్స్‌కాలనీలోని సింగరేణి పాఠశాలలో ఉచితంగా స్పోకెన్ ఇంగ్లిషు తరగతులు నిర్వహిస్తునట్టు ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీరాణి తెలిపారు. పాఠశాలలో చదివే 6,7,8,9,10 తరగతుల విద్యార్థులతోపాటు చుట్టు పక్కల పరిసరాల గ్రామాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 28 నుంచి తరగతులు ప్రారంభం అవుతాయని, ఆసక్తి గల విద్యార్థులు ఆధార్ జిరాక్స్‌లతో పాఠశాలలో సంప్రదించాలని ఆమె సూచించారు.

యువ వికాసం దరఖాస్తుదారులు సర్టిఫికెట్లు సమర్పించాలి : మునిసిపల్ కమిషనర్

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): యువ వికాసం రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులు మునిసిపల్ కార్యాలయంలో సంబంధిత సర్టిఫికెట్లు అప్పగించాలని కమిషనర్ బిర్రు శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యువ వికాసం రుణాల కోసం నోటిఫికేషన్ జారీ చేయగా భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలో 2,625 మంది దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసుకున్నారని తెలిపారు. వీటిలో 2,368 దరఖాస్తులకు సంబంధించిన జిరాక్స్ ప్రతులు మాత్రమే తమకు చేరాయని పేర్కొన్నారు. మిగతా వారు వెంటనే ఆన్‌లైన్ చేసిన దరఖాస్తు కాపీతో పాటు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఆదాయం సర్టిఫికెట్, పాస్‌ఫొటో, బ్యాంక్ పాస్‌పుస్తకం, పాన్‌కార్డు, కులం సర్టిఫికెట్ జిరాక్స్‌లను తీసుకొచ్చి కార్యాలయంలోని రూం నెంబర్ 12లో అప్పగించాలని తెలిపారు.

ఉపాధ్యాయులకు పరీక్ష!

అభ్యాసన సామర్థ్యాలను పెంచేందుకు శిక్షణ • విద్యార్థుల ఉన్నతి కోసం విద్యాశాఖ కసరత్తు

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు ఇది పరీక్షాకాలం. విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించడం కోసం విద్యాశాఖ ఇస్తున్న శిక్షణను పొందడమే కాకుండా దానిపై నిర్వహించే పరీక్ష రాసి మార్కులు కూడా తెచ్చుకోవాల్సిన బాధ్యత ఉంది. మే నెలలో ఇచ్చే ఈ శిక్షణకు వెళ్లాల్సిన ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకోవాలని ఆహ్వానించింది. ఈ ప్రక్రియ ఈ నెల 21 నుంచి 24వరకు వాటిని స్వీకరించింది. ఈనెల 28న తుది జాబితాను ప్రకటించనుంది. ఈసారి ప్రాథమిక స్థాయి మొదలుకుని ఉన్నత స్థాయి వరకు విద్యార్థుల ప్రతిభను మెరుగుపరచడమే లక్ష్యంగా విద్యాశాఖ కసరత్తు చేస్తోంది.

నిర్వహణ కమిటీ ఇదే..

అభ్యాసన సామర్థ్యాలను పెంచడం కోసం ఇచ్చే శిక్షణలో జిల్లా కలెక్టర్ ఎడ్యుకేషన్ చైర్మన్‌గా ఉంటారు. అలాగే జిల్లా విద్యాశాఖాధికారి కన్వీనర్‌గా, డైట్ ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీ సభ్యుడిగా, క్వాలిటీ కోఆర్డినేటర్‌గా ఒకరు, ముగ్గురు సబ్జెక్ట్ ఎక్స్‌పర్టులు కమిటీ సభ్యులుగా వ్యవహరించనున్నారు.

ఈ నెల 21 నుంచి 24వరకు శిక్షణ పొందాలనుకునే ఉపాధ్యాయుల నుంచి విద్యాశాఖ దరఖాస్తులను స్వీకరించింది. వాటిని ఈ నెల 28న ఫైనల్ చేస్తారు. అనంతరం ఈ నెల 30న ఆ లిస్ట్‌ను శిక్షణ కోసం ప్రభుత్వానికి సబ్‌మిట్ చేస్తారు. అయితే.. జిల్లా స్థాయిలో శిక్షణ ఇచ్చే డీఆర్‌సీలు రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందుతారు. అలాగే మండలస్థాయిలో శిక్షణ ఇచ్చే ఉపాధ్యాయులు జిల్లా స్థాయిలో శిక్షణ పొందుతారు.

విషయ సూచికలు ఇవే...

జిల్లా స్థాయిలో శిక్షణ ఇచ్చే డీఆర్‌పీలు తెలుగుకు నలుగురు, హిందీకి నలుగురు, ఆంగ్లానికి నలుగురు, గణితానికి నలుగురు, ఫిజికల్ సైన్స్‌కు నలుగురు, బయోలాజికల్ సైన్స్‌కు నలుగురు, సాంఘిక శాస్త్రానికి నలుగురు, ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు నలుగురు, ప్రత్యేక విద్యాబోధనకు నలుగురు కావాల్సి ఉంది. ప్రాథమిక స్థాయిలో తెలుగు/ ఇంగ్లిష్ మీడియం కలుపుకొని మండల రిసోర్స్ పర్సన్లు ఎనిమిది మంది ఉంటారు. అలాగే 10 మంది జిల్లా రిసోర్స్ పర్సన్ ఉంటారు. అలాగే ఎల్ఎఫ్ఎం ప్రధానోపాధ్యాయులు (ప్రాథమిక పాఠశాల స్థాయిలో) నలుగురు, జీహెచ్ఎం ప్రధానోపాధ్యాయులు (ఉన్నత పాఠశాల స్థాయి) నలుగురు ఉంటారు. వీరంతా ఆయా విషయ సూచికల్లో ప్రావీణ్యం పొంది మిగతా ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయనున్నారు.

50 మార్కుల ప్రక్రియ

శిక్షణ పొందే ఉపాధ్యాయులకు 50మార్కుల పరీక్ష ఉంటుంది. ఇందులో విషయ నైపుణ్యంపై 10 మార్కులు, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై 10మార్కులు, బోధనా నైపుణ్యాలపై 10మార్కులు, డిజిటల్ టూల్స్ అండ్ టీచింగ్‌పై 10మార్కులు, వినూత్న అభ్యాసంపై 5మార్కులు, శిక్షణ అవసరాల విశ్లేషణపై 5మార్కులు ఉంటాయి. వీటిపై ఉపాధ్యాయులకు ఇంటర్వ్యూ కూడా ఉంటుంది.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడానికే..

ఏ తరగతి విద్యార్థి అయినా సరే ఆయా తరగతిలో నేర్చుకోవాల్సినవి సులువుగా నేర్చుకునేందుకు చేసే ప్రయత్నం. అలాగే విద్యార్థులు శ్రద్ధతో నేర్చుకునేలా చేయడం, వారికి ఆటపాటలతో పాటు డిజిటల్ విద్యాబోధన ద్వారా చాలా కాలం వారికి గుర్తుండిపోయేలా చేయడం, మొత్తంగా విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించి రాయడం, చదవడం, పరీక్షలు సులువుగా రాసేలా తయారుచేయడం వంటివి ఇందులో ఇనుమడింపజేశారు. ఈ శిక్షణ మే నెలలో మొదటి 15రోజుల పాటు ఉంటుందని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

పారదర్శకత కోసమే భూ భారతి చట్టం

అవగాహన సదస్సుల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ



మొగుళ్లపల్లి సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఏళ్లతరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు భూ భారతి చట్టంతో పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. పారదర్శకత కోసమే ఈ చట్టాన్ని ప్రభుత్వం రూపొందించిందని మండల కేంద్రంలోని రైతు వేదికలో కొత్త ఆర్‌వోఆర్ చట్టం భూభారతిపై రైతులకు అవగాహన సదస్సు జరిగింది. ముందుగా భూభారతి చట్టంలోని వివరాలను ఆర్డీవో రవి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే సత్యనారా యణరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి చట్టం రైతులపాలిట శాపంగా మారిందని అన్నారు. ఏ తప్పు చేయకుండానే రైతులు అధికారుల ముందు దోషులుగా నిలబెట్టిందని అన్నారు. ధరణి లోపాలతో రైతులు, అధికారుల మధ్య గొడవలు సృష్టించి రైతుల ఆత్మహత్యలకు ఉసిగొల్పిందని అన్నారు. మేధావులు, రాజకీయ నాయకులు, రైతు సంఘం నాయకులు, అధికారులతో చర్చించి మెరుగైన ఆర్‌వోఆర్ చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రూపొందించిందని పేర్కొన్నారు. కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ కొన్ని సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను భూభారతి చట్టం ద్వారా పరిష్కరించు కోవాలన్నారు. రైతులకు ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా నేరుగా అధికారులకు అప్పీల్ చేసుకోవచ్చని అన్నారు. గత కొన్ని నెలల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా ట్రాక్టర్ల ద్వారా ఇతర జిల్లాలకు, పరకాల, హనుమకొండ, జమ్మికుంట, నడికూడ, కమలాపూర్, ఇల్లంతకుంట మండలాలకు ఇసుక రవాణా జరుగుతుందని, ఈ దందాను అరికట్టాలని రైతు పులి శ్రీనివాసరెడ్డి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే 26మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. తహసీల్దార్ సునీత, చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీదేవి, వైస్ చైర్మన్ ఎమ్డీ.రఫి, పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి నర్సింహారావు, మండల స్పెషలాఫీసర్ సునీత, రైతులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలకు పరిష్కారం

టేకుమట్ల (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టంలో రైతుల భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారా యణరావు అన్నారు. మండలంలోని పంగిపల్లి గ్రామంలోని అమ్మ గార్డెన్‌లో తహసీల్దార్ విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన భూ భారతి అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథులు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్ శర్మ హాజరయ్యారు. భూ భారతిపై రైతులకు అవగాహన కల్పించారు. గత కొన్ని సంవత్సరాలుగా రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఆ సమస్యల పరిష్కారం దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం చట్టాన్ని ప్రవేశపెట్టిం దన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణిలో ఉన్న లోపాలను సవరిస్తూ భూ భారతిని రూపొందిం చినట్లు తెలిపారు. కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ భూ భారతి చట్టంలో భూములు కొన్నా, అమ్మినా సర్వేయర్‌తో హద్దుల మ్యాప్ తయారు చేసి పట్టాదారు పాస్ పుస్తకాల్లో నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా, మండల అధికారులు, రైతులు, ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయ అభివృద్ధికి కృషి

రేగొండ (ఆంధ్రజ్యోతి) : చెన్నాపూర్ గ్రామంలోని పెద్దమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. కొత్తపల్లి గోరి మండలంలోని చెన్నా పూర్‌లో నిర్మించిన పెద్దమ్మతల్లి ఆలయాన్ని ఆయన దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పూజారులు, గ్రామస్థులు ఆయన్ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టన్న, పీఏసీఎస్ చైర్మన్ విజ్ఞన్‌రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముద్దనపల్లి శంకరయ్య, బండారి దేవేందర్, కిరణ్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

దళారులకు ధాన్యాన్ని విక్రయించొద్దు

కృష్ణకాలనీ(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని రైతులు దళారులకు విక్రయించొద్దని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి మండలంలోని నాగారం, ఆజంనగర్, నందిగామ, దీక్షకుంట, పంబాపూర్, గొల్లబుద్ధారం, న్యూ లంబాడితండా, కమలాపూర్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. అక్కడ ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు, కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

తాడ్వాయి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు, కూలీలకు సౌకర్యాలు కల్పించాలని తహసీల్దార్ సురేష్‌బాబు అన్నారు. నార్లాపూర్ గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం తనిఖీ చేశారు. ఎండలో పని చేస్తున్న రైతులకు పలు జాగ్రత్తలు వివరించారు. రైతులకు, కూలీలకు, హమాలీలకు వడదెబ్బ తగలకుండా చర్యలు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద టెంట్, తాగునీరు, టాయిలెట్, ప్రథమ చికిత్స కేంద్రం తదితర సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నాగయ్య, రెవన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సివిల్స్‌లో సత్తాచాటిన సింగరేణి కార్మికుడి కుమారుడు

(3వ పేజీ తరువాయి)

ఉన్నత స్థానానికి పంపడం గర్వకారణమని కొనియాడారు. ఆన్‌లైన్ కోచింగ్ మాత్రమే తీసుకున్న జితేంద్ర నాయక్ 855 ర్యాంకు సాధించడం గొప్ప విషయమన్నారు. ఆయన్ను సింగరేణి సీఎండీ సైతం అభినందించారని తెలిపారు. జితేందర్ నాయక్ మాట్లాడుతూ తనకు సింగరేణి సీఎండీ బల రాం నాయక్ ఆదర్శమన్నారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకొని చదువులో ముందుకు సాగానన్నారు. ఇన్‌చార్జి ఎస్‌ఓ టూ జీఎం పోషమల్లు, కేటీకే వన్ గ్రూప్ ఏజెంట్ వెంకటరమణ, ఏజీఎం ఐఈడి జ్యోతి, ఇన్‌చార్జి ఏరియా ఇంజనీర్ అరుణ్‌ప్రసాద్, ఏరియా అధికార ప్రతినిధి కావూరి మారుతి పాల్గొన్నారు.

ఉగ్రదాడిపై నిరసన

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లోని పహెల్గాంలో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా భూపాలపల్లిలో గురువారం రాత్రి జయశంకర్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని జయశంకర్ పార్కు నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు కొవ్వొత్తులు, కాగడాలతో ప్రదర్శన చేపట్టారు. ఉగ్రవాదులను శిక్షించాలని డిమాండ్ చేశారు. పాకిస్తాన్ డౌన్ డౌన్ అని నినదించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రొడ్డ రవి, బిల్లా రాజిరెడ్డి, తిరుపతిగౌడ్, రాజు, శ్రీనివాస్ నవీన్, నరేందర్, సంపత్, సంతు, రఘు తదితరులు పాల్గొన్నారు.



భూపాలపల్లిలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు